

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 23 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 70 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఏపీలో ఉవ్వెత్తున జనాగ్రహ దీక్షలు



అమరావతి: టీడీపీ బూతు వ్యాఖ్యలకు నిరసనగా ఏపీ వ్యాప్తంగా జనాగ్రహ దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండో రోజు కూడా ప్రజాగ్రహం వ్యక్తమవుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నేత పట్టాభి చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమగోదావరి: సీఎంపై టీడీపీ నేతల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కొవ్వూరులో చేపడుతున్న రెండో రోజు జనాగ్రహ దీక్షలో రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మీద బురద జల్లేందుకు చంద్రబాబు నాయుడు అన్ని అస్త్రాలు వాడేశారు. ప్రస్తుతం ఫ్రస్టేషన్‌తో ఆయన పేటీఎం బ్యాచ్‌తో ముఖ్యమంత్రిని బూతులు తిట్టిస్తున్నారు. పట్టాభి మాట్లాడిన మాటలు చంద్రబాబుకు తెలుసా తెలియదా. దొంగ దీక్షలు చేస్తున్న చంద్రబాబు.. పట్టాభి మాటలకు ఆయన ముఖ్యమంత్రికి క్షమాపణలు చెప్పాలి' అని మార్గాని భరత్ అన్నారు.

శ్రీకాళహస్తి: సీఎం జగన్‌పై టీడీపీ నేత పట్టాభి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శ్రీకాళహస్తి పట్టణంలో వైఎస్సార్ సీపీ తలపెట్టిన జనాగ్రహదీక్ష ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేకనే చంద్రబాబు ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నారంటూ ఎమ్మెల్యే మండిపడ్డారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ నేత బొజ్జల సుధీర్ రెడ్డిని నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో హిజ్రాలకు జరిగిన అన్యాయాన్ని ఎమ్మెల్యే వివరించారు. చంద్రబాబు, పట్టాభి, బొజ్జల సుధీర్ రెడ్డి చిత్రపటాలను కాలి కింద వేసి తొక్కి హిజ్రాలు నిరసన తెలియజేశారు.

నెల్లూరు: ఉదయగిరిలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి రెండవ రోజు జనాగ్రహ దీక్షలో పాల్గొన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు భేషరతుగా ముఖ్యమంత్రికి క్షమాపణ చెప్పాలి అంటూ డిమాండ్ చేశారుజిల్లాలోని కావలి హాస్పిటల్ సెంటర్ వద్ద రెండో రోజు జనాగ్రహ దీక్ష కొనసాగుతోంది. ఈ దీక్షలో ఏఎంసీ చైర్మన్ సుకుమార్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు శివకుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతపురం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనాగ్రహ దీక్షలు కొనసాగుతున్నాయి. శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు

### నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో పరిశుభ్రతకు

## పెద్దపీట వేయాలి: సీఎం జగన్

### ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి: నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వాతావరణానికి, ప్రజలకు హానికరమైన వ్యర్థాల తొలగింపులో అత్యుత్తమ విధానాలు పాటించాలని అధికారులకు సూచించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. క్లాప్ కార్యక్రమం కింద ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొత్తగా వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. గ్రేడ్- 2,3, నగర పంచాయతీలకు క్లాప్ కింద నిర్దేశించిన వాహనాలన్నింటినీ కూడా ఆయా నగరాలకు, పట్టణాలకు, నగర పంచాయతీలకు, పంచాయతీలకు చేరవేయాలన్నారు. ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను వీలైనంత తర్వగా తెప్పించుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత కంపెనీలతో మాట్లాడుకుని ఆయా వాహనాలను సత్వరమే తెప్పించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగరాలు, పట్టణాల్లో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నుంచి సమీప ఇళ్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు గార్బేజ్‌ను తొలగించడమే కాకుండా దుర్వాసన ఆ ప్రాంతంలో రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుంటూరు వ్యర్థాలనుంచి విద్యుత్ ఉత్పత్తి కర్మాగారం సిద్ధమైందని అధికారులు సీఎం జగన్‌కు వెల్లడించారు. ప్రతిపాదిత ప్రాంతాల్లో కూడా ఈ ప్లాంట్లపై దృష్టిపెట్టాలని ముఖ్యమంత్రి తెలిపారు. పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణపై అధికారులు దృష్టిపెట్టాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించడంపైనే కాదు, వాటిని పరిశుభ్రంగా ఉంచేలా ప్రత్యేక దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. గ్రామాల్లో డస్ట్‌బిన్స్ లేని వాళ్లకు డస్ట్‌బిన్స్ ఇవ్వాలని, విలేజ్ క్లినిక్స్ ద్వారా నీరు, గాలిలో కాలుష్యంపై పరీక్షలు చేయించాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యంపైనా నివేదికలు తెప్పించుకుని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా తాగునీటి వాటర్ ట్యాంక్‌లను పరిశుభ్రం చేయించాలన్నారు. 'వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై నిరంతరం దృష్టిపెట్టాలి. మురుగునీటి కాల్వల నిర్వహణపై అధికారులు దృష్టిపెట్టాలి. ఎక్కడా కూడా మురుగునీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి. నివాస ప్రాంతాల్లో మురుగునీటి నిల్వ లేకుండా చేయాలి. దీన్నొక సవాల్‌గా తీసుకోవాలి. అవసరమైన ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్లలో అత్యాధునిక విధానాలను పాటించాలి. క్లాప్ కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తున్న కమాండ్ కంట్రోల్ రూపంలో సమర్థులైన అధికారులను పెట్టాలి. వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించి వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలి' అని సీఎం అధికారులను ఆదేశించారు.

### వీఐపీ సంస్కృతికి చోటివ్వలేదు..

## శాస్త్రీయ పద్ధతిలోనే వ్యాక్సినేషన్: ప్రధాని మోదీ




న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. అక్టోబర్ 21వ తేదీన దేశంలో కోవిడ్ టీకా పంపిణీ విషయంలో వంద కోట్ల మార్క్‌ను అందుకున్నట్లు మోదీ తెలిపారు. ఈ ఘనత దేశంలోని ప్రతి ఒక పౌరుడికి చెందుతుందన్నారు. ఈ మార్క్‌ను అందుకున్న నేపథ్యంలో ప్రతి పౌరుడికి కంగ్రాట్స్ చెబుతున్నట్లు ప్రధాని అన్నారు. వంద కోట్ల వ్యాక్సిన్ డోసులు కేవలం సంఖ్య మాత్రమే కాదు అని, దేశ చరిత్రలో ఇదో కొత్త అధ్యాయం అన్నారు. కఠిన పరిస్థితుల్లో ఇండియా ఓ లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకున్నట్లు చెప్పారు. లక్ష్యాల కోసం దేశం కఠినంగా పనిచేస్తుందన్న సంకేతాన్ని చెబుతుందన్నారు. ఇది భారత సామర్థ్యానికి ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. కొత్త ఇండియా ఇమేజ్‌కు ఇది నిదర్శనమన్నారు. బిలియన్ వ్యాక్సిన్ డోసుల పంపిణీలో వీఐపీ కల్చర్ చోటుచేసుకోలేదన్నారు. వ్యాక్సినేషన్ కార్యక్రమంపై మొదట్లో చాలా భయాందోళనలు వ్యక్తం అయ్యాయని, ఇండియా లాంటి దేశంలో వ్యాక్సిన్ క్రమశిక్షణ ఎలా సాధ్యం అవుతుందని విమర్శించారన్నారు. సబ్‌కా సాత్.. సబ్ కా వికాశ్‌కు ఇండియా వ్యాక్సిన్ ప్రోగ్రామ్ సజీవ ఉదాహరణ అన్నారు. వ్యాక్సినేషన్ కార్యక్రమంపై వీఐపీ కల్చర్ ప్రభావం పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి ఒక్కర్నీ సమంగా చూశామన్నారు. దేశంలో జరిగిన వ్యాక్సినేషన్ విధానంపై గర్వంగా ఫీలవ్వాలని, శాస్త్రీయ పద్ధతిలో.. శాస్త్రీయ ఆధారంగా వ్యాక్సినేషన్ జరిగినట్లు ప్రధాని తెలిపారు. సంపూర్ణంగా సైంటిఫిక్ పద్ధతుల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగినట్లు ఆయన చెప్పారు. భారత ఆర్థికవ్యవస్థ పట్ల దేశంలోని, విదేశాల్లోని నిపుణులు పాజిటివ్‌గా ఉన్నట్లు ప్రధాని తెలిపారు. రికార్డు స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని, అలాగే యువతకు కొత్త ఉపాధి అవకాశాలను కూడా క్రియేట్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు అంతటా ఆశావాదమే కనిపిస్తోందన్నారు. ఇప్పుడు అందరూ మేడిన్ ఇండియా గురించి మాట్లాడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు తొలి డోసు వ్యాక్సిన్ తీసుకోని వారికి ప్రాధాన్యత ఇవ్వాలని, వాళ్లంతా వ్యాక్సినేట్ కావాలని, వ్యాక్సిన్ వేయించుకున్నవాళ్లు ఇతరుల్ని ఎంకరేజ్ చేయాలని, రాబోయే పండుగ సీజన్ వేళ ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మోదీ తెలిపారు.

## అమరావతి అంటాడు.. ఇక్కడ మాత్రం మా అల్లుడికి ఇళ్లు లేదు



గుంటూరు: చంద్రబాబు దుర్మార్గుడు, అబద్దాల కోరు అంటూ తెలుగు?సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి ఫైర్ అయ్యారు. గుంటురులో రెండో రోజూ కొనసాగుతున్న జనాగ్రహ దీక్షలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. 'అన్ని వ్యవస్థల్లోనూ చంద్రబాబు తన మనుషులను పెట్టుకొని వ్యవస్థలను భ్రష్టుపట్టించాడు. బాబు అనకూడని, వినకూడని మాటలు అనిపించి పైశాచిక ఆనందాన్ని పొందుతాడు. సంస్కారానికి, చంద్రబాబుకి చాలా దూరం ఉంది. అబద్ధం చంద్రబాబుతోనే పుట్టింది. అతనితోనే పెరిగింది. అతనితోనే పోతుంది. ఆయన సొంత నియోజకవర్గంలోనే గెలవలేని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో రోజుకో నూసెన్స్ క్రియేట్ చేస్తున్నాడు. సీఎం వైఎస్ జగన్ 30 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తే.. చంద్రబాబు కోర్టుకెళ్లి స్టే తెచ్చాడు. అమరావతి అంటాడు ఇక్కడ మాత్రం మా అల్లుడికి ఇళ్లు లేదు. నేను వచ్చేటపుడు చూశాను. తెలుగుదేశం పార్టీ ఆఫీస్ దగ్గర బిర్యానీ పొట్లాలు అందలేదని కొంతమంది, డబ్బులు అందలేదని మరికొంతమంది గొడవ చేస్తున్నారు. తినటానికి వీలుగా వెనుక ఒక తెర కట్టుకుని మా అల్లుడు దీక్ష చేస్తున్నాడు. రాష్ట్రంలో మహానేత పాలన సాగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మహానేతగా తయారు చేశారు' అని లక్ష్మీపార్వతి అన్నారు.

## బరోడా కిసాన్ పక్వాడా.. రైతు రుణాలకే అధిక ప్రాధాన్యం

హైదరాబాద్: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని కిసాన్ దివాస్‌ను బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రారంభించింది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఈయా) ఆలోచనలకు అనుగుణంగా మన చర్యలే మన భవిష్యత్ థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.




పక్షం రోజుల పాటు నిర్వహించే ఈ బరోడా కిసాన్ పక్వాడాలో భాగం కావాలంటూ రైతులకు పిలుపు నిచ్చింది. భారతదేశవ్యాప్తంగా పక్షం రోజులపాటు సాగే ఈ కార్యక్రమం 2021 అక్టోబర్ 31న ముగుస్తుంది. బరోడా కిసాన్ దివాస్ సందర్భంగా 18 జోనల్ కార్యాలయాల్లో సెంటర్ ఫర్ అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ ప్రాసెసింగ్ (అంఓఖ) పేరుతో కొత్త కేంద్రీకృత వ్యవసాయ రుణాల ప్రాసెసింగ్ కేంద్రాలను బరోడా బ్యాంకు ప్రారంభించింది. సంప్రదాయేతర వ్యవసాయ ఉత్పత్తులు, వ్యవసాయ మార్కెటింగ్ వంటి వ్యవహారాలను క్యాంప్ నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ జోన్ జనరల్ మేనేజర్ మన్‌మోహన్ గుప్తా మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో గోల్డ్ లోన్స్, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ఫైనాన్స్‌కు బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

## నవంబర్ 1 నుంచి అమరావతి రైతుల మహా పాదయాత్ర

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని పరిరక్షించాలని కోరుతూ నవంబర్ 1వ తేదీ నుంచి రైతులు మహా పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మహా పాదయాత్రకు పలువురి మద్దతును రైతులు కోరుతున్నారు. మహా పాదయాత్రకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ మద్దతును రాజధాని రైతుల ప్రతినిధులు కోరారు. శుక్రవారం ఉదయం జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్‌ను రైతులు కలిసారు. ఈ మహా పాదయాత్ర తుళ్ళూరు గ్రామం నుంచి తిరుమల వరకు 45 రోజుల పాటు సాగనుంది. డిసెంబర్ 17వ తేదీతో పాదయాత్ర ముగియనుంది. దాదాపు రెండేళ్లుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అమరావతి పరిరక్షణలో భాగంగా మహా పాదయాత్ర తలపెట్టినట్లు రైతులు చెప్పారు. రాజధాని కోసం మద్దతు తెలిపిన పవన్ కళ్యాణ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్, మనోహర్‌లు మహా పాదయాత్రకు మద్దతు ఇవ్వాలని రైతులు, జేఏసీ నేతలలు విజ్ఞప్తి చేసారు. రైతుల మహా పాదయాత్ర విజయవంతం కావాలని మనోహర్ ఆకాంక్షించారు.




## ఎల్లో మీడియాతో కలిసి చంద్రబాబు అసత్య కథనాలు: సజ్జల

గుంటూరు: చంద్రబాబుకు రాజకీయ సంస్కారం లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ.. 'ఎన్టీఆర్‌కే వెన్నుపోటు పొడిచిన చరిత్ర చంద్రబాబుది. బాబు లాంటి ద్రోహి ఉండటానికి వీల్లేదని ఎన్టీఆర్ ఆనాడే అన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే పట్టాభి అనుచిత వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలను చంద్రబాబు మరింత దిగజార్చారు. కావాలనే సీఎంపై అడ్డగోలు వ్యాఖ్యలు చేస్తున్నారు. అధికారం లేకపోయేసరికి చంద్రబాబుకు మతిభ్రమించింది. రాష్ట్రంలో గొడవలు సృష్టించాలని చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారు. ఎల్లో మీడియాతో కలిసి చంద్రబాబు అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారు. యువకుడైన సీఎం బాధ్యతగా వ్యవహరిస్తుంటే.. 70 ఏళ్ల వ్యక్తి బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబును ప్రజలు అసహ్యించుకుంటున్నారు. టీడీపీ గుర్తింపు రద్దు చేయాలని ఈసీని కోరుతాం. పాప విముక్తి కావాలంటే ఇప్పటికైనా చంద్రబాబు క్షమాపణ కోరాలి' అని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.



## కర్నూలుకు దామోదర సంజీవయ్య పేరు పెట్టాలి: పవన్ కళ్యాణ్

అమరావతి: ఎందరో స్వాతంత్ర్య సమెయోధులు తమకు స్ఫూర్తి ప్రదాతలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. బూరుగుల రామకృష్ణ స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి పదవిని వదిలేసుకున్నారని తెలిపారు. పీవీ నరసింహారావు ప్రధాని అయ్యాక ఎన్నో ఆర్థిక సంస్కరణలు తెచ్చారని గుర్తుచేశారు. దామోదరం సంజీవయ్య రెండేళ్లే పదవిలో ఉన్నా... ఎంతో సేవ చేశారని కొనియాడారు. వరదరాజుల ప్రాజెక్టు, పులిచింతల ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. కార్మిక శాఖ మంత్రిగా కార్మికుల కోసం అనేక విధానాలు అమలు చేశారని ఆయన అన్నారు. తెలుగు భాషలోనే ఉత్తర, ప్రత్యుత్తరాలు నడపాలని ఆదేశించారని చెప్పారు. వెనుకబడిన తరగతులవారికి రిజర్వేషన్‌ల కోసం సంజీవయ్య కృషి చేశారన్నారు. చాలా వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్ పథకాలకు ఆద్యుడన్నారు. ఇటువంటి మహనీయుడు పేరు నేటి తరాలకు తెలియకుండా చేశారని మండిపడ్డారు. పాలకులు అటువంటి మహనీయుల త్యాగాలను కనీసం గుర్తు చేసుకోవడం లేదన్నారు. కోటి రూపాయల నిధులు సేకకరించి... దామోదరం సంజీవయ్య స్మారక భవనాన్ని నిర్మిస్తామని పవన్ ప్రకటించారు. కర్నూలు జిల్లాలోని పెదపాడులో ఉన్న ఆయన ఇంటిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆయన చనిపోయే నాటికి బ్యాంకులో రూ.17వేలు, ఒక ఫియేట్ కారు మాత్రమే ఉన్నాయన్నారు.



# సంపాదకీయం

శనివారం 23 అక్టోబరు 2021

## జలజగడాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

రెండు తెలుగు రాష్ట్రాల నేతల మధ్య జలవివాదం ఇబ్బందికరంగా మారనుంది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఖచ్చితంగా రాష్ట్రం కోసం ఇద్దరూ నేతలు పోరాడాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించారు. ఏపీ ప్రభుత్వం వ్యవహారశైలి వల్లనే ప్రాజెక్టులు కేంద్రం పర్యవేక్షణలోకి వెళ్లాయని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో ఏపీకి నష్టం చేయాలన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నారని ఏపీ ముఖ్యమంత్రి జగన్ భావిస్తున్నారు. ఇవి పైకి కనపడుతున్నాయి. కానీ ఎన్నికలకు ముందు ఇద్దరూ పరోక్షంగా ఒకరికి ఒకరు సహకరించుకుంటారన్న టాక్ రెండు పార్టీల్లో వినపడుతుంది. తెలంగాణలో 2023లో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో కేసీఆర్ కు జగన్ సహకారం ఎంతో అవసరం. తాను తెలంగాణలో పార్టీని మూసేశామని ఇప్పటికే వైసీ?పీ నేతలు ప్రకటించారు. అయితే వైఎస్ షర్మిల పార్టీ పెట్టారు. అయినా కూడా ఎంతమాత్రం సహకరించకూడదని నిర్ణయించారు. ఇది పరోక్షంగా కేసీఆర్ కు సహకరించినట్లేనని అంటున్నారు. వైఎస్ షర్మిల కేసీఆర్, కేటీఆర్ ఆయనప్రభుత్వాన్ని ఎన్ని విమర్శలు చేస్తున్నా టీఆర్ఎస్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఆమెను లైట్ గానే తీసుకుంటున్నారు. కేసీఆర్ మూడోసారి విజయం సాధించాలంటే పరోక్షంగా జగన్ సహకారం అవసరం ఉంటుంది. చంద్రబాబు ఎటూ ఏదో ఒక పార్టీతో కలిసి తనను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తాడని కేసీఆర్ కు తెలుసు. అందుకే జగన్ తో రాజకీయంగా సఖ్యతనే కోరుకుంటారు. ష్ణా, గోదావరి బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం జారీచేసిన గెజిట్ అమలుపై కొనసాగుతున్న ప్రతిష్ఠంభనపై కేంద్రం దృష్టిసారించినట్లు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ రెండు బోర్డులతో ఈ అంశంపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ నెల 14వ తేదీ నుంచి గెజిట్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఏపీ, తెలంగాణ పరిధిలో కృష్ణా నదిపై శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద 15 అవుట్‌లెట్లు, గోదావరి పరీవాహకంలోని పెద్దవాగు ప్రాజెక్టులను మొదటి దశలో అప్పగించాలనే అంశంపై బోర్డులు తీర్మానాలు చేశాయి. వీటిపై రెండు రాష్ట్రాలు ఉత్తర్వులు (జీవో) జారీచేయాల్సి ఉంది. కృష్ణా ప్రాజెక్టులకు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది. బోర్డుల సమావేశాల్లో ప్రతిపాదనలపై తీర్మానాలను ఆమోదించాక కూడా వాటి అమలులో జరుగుతున్న జాప్యం, అవరోధాలను తొలగించడమే ధ్యేయంగా జల్‌శక్తిశాఖ బోర్డులతో ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధాన ప్రాజెక్టు అమలుపై రాష్ట్రాల అభిప్రాయాలు కోరనున్న నేపథ్యంలో రాష్ట్ర అవసరాలు, హక్కులను వినిపించేందుకు తెలంగాణ నీటిపారుదల శాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 28వ తేదీన కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఆన్‌లైన్‌లో సంబంధిత రాష్ట్రాల సీఎంలతో ఈ విషయమై మాట్లాడనున్నారు. 29వ తేదీన హైదరాబాద్‌లో తొమ్మిది రాష్ట్రాల నీటిపారుదల శాఖలతో జల్‌శక్తిశాఖ సహాయ మంత్రి సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి బేసిన్‌లో ఇప్పుడున్న నీటి వినియోగం ఎంత? నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర అవసరాలు ఏ మేరకు ఉంటాయి? తదితర అంశాలు కేంద్రానికి వివరించేలా తెలంగాణ అంతరాష్ట్ర జల వనరుల విభాగం ఓ ప్రజంటేషన్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ మేరకు బుధవారం నిర్వహించిన సమావేశంలో దీనిపై చర్చించినట్లు కూడా తెలిసింది. గోదావరి, కృష్ణా పరీవాహకంలో నీటి అవసరాలు, కేటాయింపులు, ట్రైబ్యునళ్లలో కొనసాగుతున్న వ్యాజ్యాలు తదితర అంశాలనూ కేంద్రం ముందు పెట్టేందుకు నీటిపారుదల శాఖ సిద్ధమవుతోంది. ఇక ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సమయం లోనూ పరోక్షంగా జగన్ కు కేసీఆర్ సహకారం అవసరం. కేసీఆర్ప్ర భావం ఏపీలో కొంత ఉండే అవకా శ ముంది. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇద్దరూ యుద్ధమేచేస్తున్నా, రాజకీయాలకు వచ్చేసరికి కేసీఆర్, జగన్ లు ఒక్కటవుతా రన్నది వాస్తవం. ఇద్దరి ఉమ్మడి శత్రువు చంద్రబాబు కాబట్టి వచ్చే ఎన్నికలకు ఇద్దరూ పరోక్షంగా ఒకరికొకరు సహకరించుకోనున్నారు.

# చంద్రబాబు నాయుడు దీక్ష కు జేసీ ప్రభాకర్ రెడ్డి మద్దతు



విజయవాడ తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి విజయవాడలోని టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న 36 గంటల దీక్షకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. చంద్రబాబు నిర్వహిస్తున్న దీక్షకు ఆయన హాజరై సంఘీభావం తెలియజేశారు. దీక్షాస్థలికి జేసీ ప్రభాకర్ రెడ్డి చేరుకోగానే టిడిపి కార్యకర్తలు ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ చుట్టుముట్టారు. జెసిపిఆర్ తో సెల్ఫీలు దిగడానికి కార్యకర్తలుపెద్ద ఎత్తున ఎగబడ్డారు... చంద్రబాబు నాయుడు దీక్ష లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. దీక్షలో పాల్గొన్న జేసీ ప్రభాకర్ రెడ్డి తనను కలసిన పత్రికేయులతో మాట్లాడుతూ ఏకంగా టిడిపి కార్యాలయం పైన వైకాపా

### సంఘీభావం తెలుపుతూ దీక్షలో పాల్గొన్న జేసీ ప్రభాకర్ రెడ్డి

మద్దతుదారులు దాడి చేయడం హేయమైనచర్యగా జేసీ ప్రభాకర్ రెడ్డి అభివర్ణించారు. గతంలో కూడా తాడిపత్రి లోని తన ఇంటి పై వైకాపా నాయకులు దాడి చేసిన విషయాన్ని ప్రజాస్వామ్య వాదులు ఎవరు మర్చిపోలేదు అన్నారు. భౌతిక దాడులకు పాల్పడ్డాలనే ఉద్దేశంతో సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన తన ఇంటిపైనే వైకాపా నాయకులు దాడికి తెగబడ్డారని ఆయన విమర్శించారు. మా జెసి సోదరులు ఇంట్లో లేకున్నా ఆత్మవిశ్వాసం కలిగిన టిడిపి కార్యకర్తలతో పాటు, గుండె ధైర్యం గల యువకులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా వచ్చి వారి ఆగడాలపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన విషయాన్ని తెలియజేశారు. దీంతో వైకాపా నాయకులు వెనుకకు తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. టిడిపి కేంద్ర కార్యాలయం పై జరిగిన దాడి ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తోందని జెసి స్పష్టం చేశారు. డెమోక్రసీ ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఆంధ్ర ప్రజానీకంపై ఎంతైనా ఉందని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో చైతన్యం వచ్చి ప్రభుత్వంపై తిరగబడే రోజు తొందరలోనే ఉందని జెసి హెచ్చరించారు. ప్రభుత్వం పై వస్తున్న వ్యతిరేకత దృష్టి మళ్ళించడానికి వైకాపా కార్యాలయాలు , నాయకులపై దాడులు చేస్తున్నారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

### ఎస్.ఐ ను ఘనంగా సన్మానించిన సంస్థ చైర్మన్ గుర్రాల వెంకటరెడ్డి.



తుగ్గలి : ప్రతి ఏటా అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల దినోత్సవ కార్యక్రమాన్ని మండల కేంద్రమైన తుగ్గలి లోని స్థానిక ఏ.ఎస్ కళాశాల యందు కళాశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. గురువారం రోజున పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఏ.ఎస్ జూనియర్ కాలేజ్ నందు అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన అనంతరం ఏఎస్ విద్యాసంస్థల చైర్మన్ గుర్రాల వెంకటరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ తిప్పయ్య తుగ్గలి షామీర్ భాషను ఘనంగా శాలువాతో సన్మానించి మొమెంటో ను అందజేశారు. అనంతరం విద్యాసంస్థల చైర్మన్ గుర్రాల వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది పోలీసుల త్యాగఫలము వలనే నేటి సమాజం రూపుదిద్దుకుందని ఆయన తెలియజేశారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులది కీలక పాత్ర అని ఆయన తెలియజేశారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసులకు జోహార్లను తెలియజేశారు. అనంతరం జూనియర్ కాలేజ్ నందు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు పోలీసుల అమరవీరుల దినోత్సవం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఎస్ఐ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రికి కిలోల కొద్ది బంగారం

నల్గొండ, అక్టోబరు 22, (న్యూస్ పల్స్) తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి ప్రధాన ఆలయ విమాన గోపురం స్వర్ణ తాపడం పనుల కోసం రాజకీయ, వ్యాపార ప్రముఖులు భారీగా బంగారం దానం చేస్తున్నారు. ఇప్పటికే సీఎంతో సహా పలువురు ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు బంగారం అందజేసేందుకు ముందుకు వచ్చారు. తిరుమల తరహాలో ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం చేయించనున్నట్లు.. అందుకు 125 కిలోల బంగారం అవసరమవుతుందని సీఎం కేసీఆర్ ఇటీవల తెలిపారు. అయితే ప్రభుత్వమే ఇది భరించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రజలందరినీ భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతోనే విరాళాలు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు 1.16 కిలోల బంగారాన్ని తన వంతు విరాళంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. సీఎం స్ఫూర్తితో చాలా మంది రాజకీయ, వ్యాపార ప్రముఖులు కిలోల కొద్దీ పుత్తడిని విరాళంగా ప్రకటిస్తున్నారు. ముందుగా హెటెరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ పార్థసారథిరెడ్డి 5 కిలోల బంగారాన్ని విరాళమివ్వనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలోనే మంగళవారం ఒక్కరోజే 22 కేజీల బంగారం సమకూరినట్లు సమాచారం. ఇక బుధవారం మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ 6 కిలోల బంగారాన్ని విరాళంగా ప్రకటించింది. అలాగే ప్రణీత్ గ్రూప్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ కామరాజు 2 కిలోల బంగారాన్ని విరాళంగా ప్రకటించారు. ప్రముఖ వ్యాపారవేత్త ఎన్.వి.రామరాజు కిలో బంగారాన్ని విరాళంగా అందజేస్తామని తెలిపారు. ఏపీలోని కడప జిల్లా



చిన్నమండెం జెడ్పీటీసీ సభ్యురాలు మోడం జయమ్మ కేజీ బంగారం అందిస్తామని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన మేరకు దేవాలయానికి తమ కుటుంబం ఒక కిలో బంగారం విరాళంగా ఇస్తోందన్నారు. కేసీఆర్ యాదాద్రిలో పర్యటించినప్పుడు స్వామివారి సన్నిధిలో ఆయనకు చెక్కును అందజేస్తామని వెల్లడించారు. ఈ విషయాన్ని తెలంగాణ సీఎంఓ కార్యాలయానికి తెలిపామని వివరించారు. కాగా.. స్వర్ణతాపడానికి కావాల్సిన మేలిమి బంగారాన్ని రిజర్వు బ్యాంకు ద్వారా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం దేవాదాయ, వైటీడీఏ అధికారుల తో ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు సీఎం ప్రకటించారు. ఇందులో ఎవరెవరు ఉండాలో అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు.

# కనకదుర్గమ్మ వారధిపై రోడ్డు ప్రమాదం

విజయవాడ గుంటూరు జిల్లా తాడేపల్లి కనకదుర్గమ్మ వారధి పై రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాఫిక్ లో ఆగి ఉన్న కారును ప్రైవేట్ ట్రావెల్ బస్ వెనుకనుంచి కార్ ని ఢీ కొట్టింది. కారులో వున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికులకు పెను ప్రమాదం తృటిలో తప్పినాకారు మాత్రం దెబ్బతిన్నది. గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న సమయంలో వారధి పై ఘటన జరిగింది. ప్రమాదానికి కారణమైన బస్ డ్రైవర్ ను తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ ట్రావెల్ బస్సుకు సరైన పత్రాలు లేనట్లు సమాచారం.

# జనాగ్రహ దీక్షలో ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాస్

శ్రీకాకుళం టిడిపి మాటలను వ్యతిరేకిస్తూ వైసిపి చేస్తున్న జనాగ్రహ దీక్షలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాస్ పాల్గొన్నారు. నరసన్నపేట లోని వైఎస్సార్ కూడలి వద్ద జనాగ్రహ దీక్షలో పాల్గొన్న డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ 30 ఏళ్లు ఇదే ప్రభుత్వం కొనసాగుతుంది. ప్రజలు జగన్ ను గుండెల్లో పెట్టుకుంటున్నారు. ఆకాశం పై ఉమ్మి వేస్తే మీ ముఖం మీదే పడుతుందని గుర్తుంచుకోండి. సొంత పార్టీ ని కాపాడుకోలేక వికృత క్రీడలకు చంద్రబాబు పాల్పడుతున్నారు. సద్విమర్శలను ఆహ్వానిస్తాము. నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదు. వ్యక్తిగతంగా టార్గెట్ చేసి మాట్లాడాలి అనే ధోరణిలో చంద్రబాబు తీరు ఉంది. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోంది. మీకు ఈ రాష్ట్రంలో ఇక చోటు ఉండదు. మా ముఖ్యమంత్రి సంయమనంతో ఉండలాని కోరారు. మీరు హద్దు మీరితే మా వాళ్ళు ఎంత సేపు సహనంతో ఉండగలరు. కార్యకర్తలు, నాయకులు సంయమనం కోల్పోయే పరిస్థితి చంద్రబాబు తెస్తున్నారు. – బాబు మాట్లాడే బాష ఎలాంటిదో ప్రజలు చూస్తున్నారు.. ఆయన తక్షణమే క్షమాపణలు చెప్పాలి. పట్టాభి మాట్లాడిన మాటలు ఆయన వ్యక్తిగతమైతే పార్టీ నుంచి సస్పెండ్ చేయండి. లేదంటే క్షమాపణ చెప్పండి. మీరిచ్చిన బంద్ పిలుపు మీ కార్యకర్తలే పట్టించు కోలేదు. ఇక ప్రజలు నిన్ను ఎప్పుడో మర్చిపోయారు. రాజకీయాల కోసం ఇంతలా దిగజారుతారా. అధికారం కోసం అర్రులు చాచడం తప్ప ఏనాడైనా ప్రజల బాధలు పట్టించుకున్నావా? మిమ్మల్ని గ్రామాల్లో తిరగనివ్వకుండా చేస్తాము. అవినీతి రహిత పాలన రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది.. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుకు వెళ్తున్నారు. తప్పు చేసిన పట్టాభి అరెస్టయ్యారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఇక మీ దొంగ దీక్షలు కట్టిపెట్టండి చంద్రబాబని ఆయన అన్నారు.



# శ్రీశైలంలో మల్లికార్జున స్వామి ఆలయ గిరి ప్రదక్షిణం ప్రారంభం

కర్నూలు అక్టోబర్ 22 శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయ గిరి ప్రదక్షిణం తిరిగి ప్రారంభమైంది. అశ్వయుజ శుద్ధి పౌర్ణమి సందర్భంగా సంప్రదాయ శ్రీశైలం గిరి ప్రదక్షిణను ఆలయ పూజారులు పునః ప్రారంభించారు. సాధారణంగా, ప్రతి పౌర్ణమి రోజున ఈ ఆచారం కొనసాగుతుంది. కొవిడ్ మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో గిరి ప్రదక్షిణంను అధికారులు నిలిపివేశారు. తిరిగి ఏడు నెలల విరామం అనంతరం ప్రారంభించడంతో పెద్ద ఎత్తున భక్తులు హాజరై గిరి ప్రదిక్షణం చేసుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ లవన్న నేతృత్వంలో ఆలయ అధికారులు, పూజారులు దాదాపు 7 కిలోమీటర్ల ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. ఈ ప్రదక్షిణ కార్యక్రమం ఆలయ మహా ద్వారం నుంచి ప్రారంభమై.. గంగాధర మండపం, అంకాలమ్మ ఆలయం, నంది మండపం, మల్లికార్జున సదన్, వీరభద్ర దేవాలయం, గోశాల, మల్లమ్మ కన్నీరు, ఔటర్ రింగ్ రోడ్ మీదుగా ప్రధాన దేవాలయానికి చేరుకుంటుంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ముందుగా, ఆలయ అధికారులు సంప్రదాయ లక్ష కుంకుమార్చన నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి భక్తులు ఆలయ వెబ్‌సైట్ లో ఆన్‌లైన్ మోడ్ ద్వారా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# చైనాలో మళ్లీ కరోనా కలకలం

బీజింగ్, అక్టోబరు 22, (న్యూస్ పల్స్) కరోనా పుట్టిల్లు చైనా మరోసారి ప్రపంచాన్ని భయపెడుతోంది. తాజాగా దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నట్టు ప్రకటించింది చైనా. అక్కడి అధికారులు వందలాది విమానాలు రద్దు చేశారు. స్కూల్స్ మూసివేశారు. కోవిడ్ పరీక్షల వేగాన్ని పెంచి.. గురువారం భారీగా పర్యాటకులకు కరోనా పరీక్షలు నిర్వహించారు. కొన్ని ఇతర దేశాల్లో కరోనా వ్యాప్తి ఉన్నప్పటికీ అవి తాత్కాలికంగా పరిమితులను తగ్గిస్తున్నాయి. కానీ, చైనా మాత్రం దేశీయంగా అన్నిటినీ మూసివేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సరిహద్దులను మూసివేయడంతో కరోనా విషయంలో చైనా చాలా కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మరో బాంబు చైనా పేలుస్తుందా అనే అనుమానాలు అందరికీ కలుగుతున్నాయి. అధికారులు చెబుతున్నదాని ప్రకారం చైనా వరుసగా ఐదవ రోజు కొత్త కేసులను నమోదు చేసింది. ఎక్కువగా ఉత్తర, వాయువ్య ప్రాంతాల్లో కరోనా వ్యాప్తి ఉంది. ప్రస్తుతం కరోనా వ్యాప్తికి కారణంగా పర్యాటకులను



పేర్కొంటున్నారు. జియాన్, గన్సు ప్రావిన్స్ అదేవిధంగా ఇన్నర్ మంగోలియా వెళ్ళే ముందు ఒక వృద్ధ జంట షాంఘైలో పర్యటించారు. రాజధాని బీజింగ్‌తో సహా కనీసం ఐదు ప్రావిన్సులు.. ప్రాంతాలలో సన్నిహిత పరిచయాలతో డజన్ల కొద్దీ కేసులు వారి ప్రయాణంతో ముడిపడి ఉన్నాయి. వారి ద్వారా కరోనా వ్యాప్తి చెందిందని అధికారులు చెబుతున్నారు. దీంతో విమాన సర్వీసులు రద్దు చేయడమే కాకుండా.. పర్యాటకులను పూర్తిగా పరీక్షలు చేయాలని నిర్ణయించారు. వారిపై ఆంక్షలు విధించారు. వైమానిక ట్రాకర్ ఎజీతీతిఈశ్రీతిణష్ట్రబి డేటా ప్రకారం, ప్రభావిత ప్రాంతాలలోని విమానాశ్రయాలు వందల విమానాలను రద్దు చేశాయి. జియాన్, లాంజౌలోని రెండు ప్రధాన విమానాశ్రయాలకు 60 శాతం విమానాలు రద్దు చేశారు. తమ పౌరులకు జారీచేసిన నోటీసులో ఇన్నర్ మంగోలియాలోని ఎరెన్‌హాట్ నగరం లోపల, వెలుపల ప్రయాణం నిషేధించారానీ, నివాసితులు తమ గృహాలను వదిలి వెళ్లవద్దని సూచించారు. ప్రభుత్వ యాజమాన్యంలోని టాబ్లాయిడ్ గ్లోబల్ టైమ్స్ బుధవారం, ఇన్నర్ మంగోలియాలో కొత్త వైరస్ కేసులు మంగోలియా నుండి బొగ్గు దిగుమతులను ప్రభావితం చేసే అవకాశం ఉందని హెచ్చరించింది, ఎందుకంటే అక్కడి ఆంక్షల వలన సరఫరా గొలుసులో అంతరాయం ఏర్పడవచ్చని అధికారులు చెబుతున్నారు.

# రారెత్తిస్తున్న టమాటా



తిరుపతి, అక్టోబరు 22 ) టమాటా దిగుబడులపై వర్షాలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. మార్కెట్‌కు అంతంతమాత్రంగా వస్తున్న టమాటా దిగుబడులు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మరింతగా తగ్గిపోయాయి. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో కాయలపై మచ్చలు వచ్చి.. తెగుళ్లు సోకుతున్నాయి. పంట నాణ్యతగా ఉండడం లేదు. గత నెల 9న రైతులు మార్కెట్‌కు 445 మెట్రిక్ టన్నుల టమాటాలు తీసుకువచ్చారు. ఇందులో మెదటి రకం టమాట ధర కిలో రూ.14 వరకు పలికింది. ప్రస్తుతం దిగుబడులు 70 శాతం మేర తగ్గిపోయింది.ఇతర రాష్ట్రాల్లో వర్షాలకు పంట దెబ్బతినడం, డిమాండ్‌కు తగ్గ సరుకు లేకపోవడంతో ధరలు పెరిగిపోతున్నాయి. శనివారం చిత్తూరు జిల్లా మదనపల్లె మార్కెట్ యార్డులో మొదటిరకం టమాటా ధర కిలో రూ.35 నుంచి రూ.52 మధ్య పలికింది. రెండో రకం రూ.16 నుంచి రూ.33 మధ్య నమోదైంది. తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల నుంచి రైతులు 86 మెట్రిక్ టన్నుల టమాటాను మార్కెట్‌కు తీసుకువచ్చారు. కోత దశ చివరిది కావడంతో టమాటా దిగుబడులు తగ్గాయని, రబీ సీజన్ ప్రారంభమయ్యాక దిగుబడులు పెరిగే అవకాశం ఉందని హార్టికల్చరల్ ఆఫీసర్ సౌజన్య తెలిపారు.

# నంద్యాల లో మెడికల్ కళాశాల

## స్థలం కోసం అధికార పార్టీ ప్రతి పక్ష పార్టీ మాటల యుద్ధం




నంద్యాల నంద్యాల యందు అధికార పార్టీ యమ్ యల్ ఏ శిల్ప రవి చంద్ర కిషోర్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ మాజీ యమ్ యల్ ఏ భూమ బ్రహ్మానందరెడ్డి కి మాటల యుద్ధం కొనసాగుతోంది. మెడికల్ కళాశాల స్తలం విషయం లో ఇరువురి మధ్య న మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ మధ్య కాలంలో శిల్ప రవి చంద్ర కిషోర్ రెడ్డి విలేకరుల సమావేశంలో ప్రభుత్వ భూమి నంద్యాల లో ఎక్కడైనా 50 ఎకరాల భూమిని చూపెడుతే నేను నా పదవి కి రాజీనామా చేస్తానని ఆయన సవాల్ విసిరారు. నిన్న జరిగిన విలేకరుల సమావేశంలో భూమ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సవాల్ కు ప్రతి సవాల్ పరిస్కారం కాదు నేను నంద్యాల అభివృద్ధి ని కోరుకుంటున్నామని అన్నారు . మెడికల్ కళాశాల కు ఆర్ ఏ ఆర్ యస్ భూములనే ఎందుకు తీసుకుంటున్నారని భూమ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. ఆర్ ఎ ఆర్ యస్ భూములు మెడికల్ కళాశాల కు తీసుకోవడంలో ఎందుకు అంత ఆత్రత ఏంటని ప్రశ్నించారు. భీమవరం దగ్గర ల్యాండ్ సీలింగ్ భూములు 78 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. విలేకరులకు సర్వే నెంబర్లతో సహ చూపించారు. అక్కడ భూ సేకరణ చేసి మెడికల్ కళాశాల కట్టితే బాగుంటుంది కదా అని ఆయన అన్నారు. ఆసుపత్రులు కళాశాలలు ఊరు బయట ఉంటాయని ఆయన అన్నారు. గతంలో నూనెపల్లె లో గల గవర్నమెంట్ ఆసుపత్రి ఊరు బయటే ఉన్నది. ఇప్పుడు అక్కడ టౌన్ డెవలప్ అయి కలిసి పోయింది. అలాగే భీమవరం దగ్గర ఉన్న గవర్నమెంట్ భూమి లో మెడికల్ కళాశాల నిర్మాణం చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. లేదా నంద్యాల చుట్టుపక్కల గ్రామాలయందు భూసేకరణ చేసి రైతులకు డబ్బులు ఇచ్చి అక్కడైనా కట్ట వచ్చు కదా అని ఆయన అన్నారు . ఇతర చోట్ల మెడికల్ కళాశాల భూ సేకరణ కోసం సీయం జగన్ మోహన్ రెడ్డి నిధులు కేటాయిస్తు ఉంటే నంద్యాల యమ్ యల్ ఏ శిల్ప రవి చంద్ర కిషోర్ రెడ్డి కి ఎందుకు కేటాయించ లేదో అర్థం కావడం లేదన్నారు . ఆదోని మెడికల్ కళాశాల కు భూమి కోసం 23 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆర్ ఎ ఆర్ యస్ భూములు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కొత్త వంగడాల కోసం శాస్త్రవేత్తలకు భూమి ఉపయోగపడే విధంగా ఉన్నదని అన్నారు. మహనంది అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు అర్ ఎఅర్ యస్ భూములు పరిశీలనకు ఏంతో ఉప యోగ పడుతున్నాయని ఆయన అన్నారు. మాకు నంద్యాల లో రైతులకు ఉపయోగపడే ఆర్ ఎఅర్ యస్ భూములు ఉండాలని మరియు మెడికల్ కళాశాల కావాలని ఆయన అన్నారు. అభివృద్ధి లో పోటీ పడాలి కాని ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎవి అర్ ప్రసాద్. కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మూడు దసరాలు పూర్తి

విజయవాడ, అక్టోబరు 22, ఏపీ ముఖ్యమంత్రిగా జగన్ విజయం సాధించాక ఇప్పటికి మూడు దసరాలు ముగిశాయి. ఈసారి దసరాకు కూడా విశాఖకు రాజధాని తరలింపు సాధ్యం కాలేదు. శాసనసభలో జగన్ మూడు రాజధానుల ప్రకటన చేసిన తర్వాత ఉగాది, దసరాలు ఎన్నో వెళ్లిపోయాయి. ప్రతి సారి రాజధాని తరలింపు సాధ్యం కాకపోయినా ముఖ్యమంత్రి జగన్ తన క్యాంప్ కార్యాలయాన్ని తరలిస్తారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. అయినా సాధ్యం కాలేదు.గత రెండున్నరేళ్లుగా వైఎస్ జగన్ తాడేపల్లి క్యాంప కార్యాలయం నుంచే తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. సచివాలయానికి మంత్రివర్గ సమావేశాలు ఉంటే తప్ప వెళ్లడం లేదు. క్యాంపు కార్యాలయం నుంచే లబ్దిదారులకు బటన్ నొక్కి నగదును విడుదల చేస్తున్నారు. అధికారులతో సమీక్షలు, సమావేశాలు కూడా అక్కడి నుంచే. అయితే ఈసారి క్యాంప్ కార్యాలయాన్ని విశాఖకు తరలించి అక్కడి నుంచి కార్యకలాపాలు చేస్తారని చెప్పారు.విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ ప్రచారం సాగింది. విశాఖపట్నంలోని బీచ్ రోడ్డులో ఒక భవనాన్ని సీఎం క్యాంప్ కార్యాలయం కోసం చూశారని కూడా వార్తలొచ్చాయి. అప్పట్లో సీఎంవోలో ఉన్న ప్రవీణ్ ప్రకాష్‌తోపాటుడీజీపీగౌతంసవాంగ్ సయితం విశాఖను సందర్శిం చారు. ఇంకేముంది జగన్ విశాఖలో కాలుమోపడానికి ముహూర్తమే తరువాయి అని వైసీపీ నేతలు ఆర్భాటపు ప్రకటన చేశారు.అయితే అమరావతి రాజధాని అంశం కోర్టు పరిధిలో ఉన్నందున కనీసం క్యాంప్ కార్యాలయాన్ని కూడా విశాఖకు తరలించే సాహసాన్ని జగన్ చేయలేకపోతున్నారు. పరిపాలన రాజధాని తరలింపు మూడేళ్ల పాటు సాధ్యం కాలేదు. వచ్చే రెండేళ్లలో కూడా తరలించకపోతే జగన్ చేసిన ప్రకటనకు విలువ ఉండదు. అందుకే విశాఖ వైసీపీ నేతలు క్యాంప్ కార్యాలయాన్ని అయినా తరలించాలని కోరుతున్నా రు. మరి ఈ రెండేళ్లలో అది సాధ్యమవుతుందా? అన్నది సందేహమే.

# సీనియర్లపై సీరియస్



విజయవాడ, అక్టోబరు 22, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఒంటరి పోరు చేయక తప్పడం లేదు. పార్టీ నేతలు పెద్దగా కలసి రారని తెలిసే ఒంటరిగా ఆయన దీక్షకు దిగారని తెలిసింది. పార్టీ కార్యాలయాలపై పెద్దయెత్తున వైసీపీ శ్రేణులు దాడులకు దిగినా నేతల్లో పెద్దగా చైతన్యం రాకపోవడాన్ని చంద్రబాబు తీవ్రంగా తప్పుపడుతున్నారు. బంద్ విషయంలో పోలీసులు ముందస్తు అరెస్ట్ లు చేస్తారని తెలిసి అందుకు తగిన ఏర్పాట్లు ఎందుకు చేసుకోలేదని ప్రశ్నిస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యాలయాలపై దాడులు జరగడంతో టీడీపీ శ్రేణుల్లోనూ మార్పు వస్తుందని చంద్రబాబు భావించారు. అందుకే వారిలో ఉత్తేజాన్ని నింపడం కోసం బంద్ కు పిలుపు నిచ్చారు. కానీ ఆశించిన స్థాయిలో బంద్ జరగలేదు. ఒకరకంగా బంద్ విఫలమయిందనే చెప్పాలి. నిన్న సాయంత్రానికి జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకున్న చంద్రబాబు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.అందుకే తాను ఒంటరిగా 36 గంటలు దీక్షలు చేయాలని నిర్ణయించారు. గతంలోనూ రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చినా పెద్దగా స్పందన రాలేదు. పార్టీ నేతలు కేవలం ఫొటోలు తీయించుకుని కేంద్ర కార్యాలయానికి పంపి గంటలోనే కార్యక్రమాన్ని ముగించారు. అందుకే చంద్రబాబు ఈసారి ఆ తప్పిదం చేయదలచుకోలేదు. తాను ఒంటరిగానే దీక్షకు దిగాలని నిర్ణయించుకున్నారు.మరోవైపు పార్టీ కార్యాలయాలపై దాడులు జరిగినా స్పందించని నేతలపై చంద్రబాబు సీరియస్ అయినట్లు తెలిసింది. ఇప్పుడు కాక ఇంకెప్పుడు మీరు బయటకు వస్తారని కోస్తాంధ్రలోని కొందరి నేతలను చంద్రబాబు సూటిగానే ప్రశ్నించినట్లు సమాచారం. నేతలే ముదుకు రాకపోతే ఇక కార్యకర్తలు బయటకు ఎలా వస్తారని ప్రకాశం జిల్లాలోని సీనియర్ నేతకు చంద్రబాబు బాగానే క్లాస్ పీకినట్లు చెబుతున్నారు. మొత్తం మీద బంద్ విషయంలోనూ నేతలు చంద్రబాబు ఆశించినట్లు వ్యవహరించకపోవడం పట్ల ఆయన కోపంతో రగలిపోతున్నట్లు తెలిసింది.


# మారుతున్న ఆహార అలవాట్లు

కర్నూలు, అక్టోబరు 22, ఇద్దరికీ షుగర్ సాధారణ స్థితికి రావడంతో వైద్యులు ఆ రిపోర్టులు పరిశీలించి మందుల డోసు తగ్గించాడు. షుగర్ నియంత్రణలోకి రాకపోవడంతో ఆహారంలో సిరిధ్యానాలు చేర్చుకున్నాడు. మూడురోజులకు ఒక సిరిధాన్యాన్ని మార్చి మార్చి వివిధ వంటకాలు తయారు చేయించుకుని తినసాగాడు. కొన్ని రోజులకే అతని షుగర్ నియంత్రణలోకి వచ్చేసింది. వీరే కాదు జిల్లాలో అనేక మంది మెనూలో అన్నాన్ని తగ్గించడమో లేదా పూర్తిగా మానేయడమో చేస్తున్నారు. కాఫీ, టీలు తాగినా చక్కెర లేకుండా తాగుతున్నారు. తమ అలవాట్లలోనూ మార్పులు చేసుకుంటున్నారు. పాతకాలం నాటి ఆహార పద్దతులైన కొర్రలు, సజ్జలు, రాగులు, సామలు, గోదుమలతో చేసిన వంటకాలను తినేందుకు ఇష్టపడుతున్నారు. జీవనశైలిలో మార్పుల వల్ల వచ్చిన జబ్బులకు ఆహారంలో మార్పులే విరుగుడని ప్రజలు భావించి ప్లేట్‌లో మెనూనే మార్చుకుంటున్నారు. బీపీ, షుగర్, కీళ్లనొప్పులు, ఊబకాయం, గ్యాస్ట్రబుల్, గుండెజబ్బులు వంటివన్నీ జీవనశైలిలో మార్పుల వల్ల వచ్చే జబ్బులే. జిల్లా జనాభా 45లక్షలకుపైగానే ఉంది. ఇందులో 20శాతం ప్రజలు బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి జీవనశైలి జబ్బులతో బాధపడుతున్నారు. తలనొప్పి, కళ్లు తిరగడం, ఒళ్లునొప్పులు, నీరసం, మూత్రం ఎక్కువసార్లు వెళ్లడం వంటి లక్షణాలుండి వైద్యుల వద్దకు వెళ్లే ప్రతి ముగ్గురిలో ఇద్దరికి బీపీ, షుగర్ ఉన్నట్లు నిర్ధారిస్తున్నారు. విజ్ఞతగల వైద్యులు ముందుగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు. అప్పటికీ వారిలో మార్పు రాకపోతే మందులకు వెళ్తున్నారు. కానీ జిహ్వాచాపల్యాన్ని చంపుకోలేని వారు మందులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఫలితంగా ప్రతి సంవత్సరం వారు వాడే మందుల డోసు పెరుగుతుందే గానీ వ్యాధి నయం కావడం లేదు. దీనికంతటికీ విరుగుడు మళ్లీ పాత రోజుల్లోని ఆహారపు అలవాట్లకు వెళ్లాల్సిందేనని అధిక శాతం భావిస్తున్నారు. ఈ మేరకు వారు ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. ఇటీవల కాలంలో కర్నూలుతో పాటు నంద్యాల, ఆదోని లాంటి పట్టణ ప్రాంతాల్లో సాయంత్రం కాగానే జొన్నరొట్టెలు, పుల్కాలు, చపాతీలు, కర్రీలు విక్రయించే వ్యాపార కేంద్రాలు తెరుచకుంటున్నాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు అక్కడ జొన్నరొట్టెలు కొడుతూనే ఉంటారు. వేడివేడిగా రొట్టెలు ఇలా వస్తూనే అలా విక్రయాలు జరిగిపోతున్నాయి. కర్నూలులోని గాంధినగర్, వెంకటరమణ కాలని, నరసింహారెడ్డి నగర్, రైల్వేస్టేషన్ రోడ్, అశోక్‌నగర్, మద్దూర్‌నగర్, నంద్యాల రోడ్డు, గణేష్‌నగర్, సి.క్యాంపు, నాగిరెడ్డి రెవిన్యూ కాలని, బుధవారపేట, శ్రీరామనగర్ ఇలా దాదాపు అన్ని కాలనీల్లో రొట్టెలు విక్రయించే దుకాణాలు విస్తృతంగా వెలిశాయి. ఒక జొన్న రొట్టె, చపాతీలు ఒక్కోటి రూ.12ల నుంచి రూ.15ల వరకు విక్రయిస్తున్నారు. వీటిలోకి కర్రీలు కావాలంటే అదనంగా రూ.10 నుంచి రూ.15లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యాపారులు తక్కువ సమయంలో లాభార్జన చేసేందుకు గాను జొన్న పిండిలో బియ్యం పిండి కలిపి రొట్టెలు చేస్తున్నారు. దీనివల్ల ప్రజలు తమ ఆహారాన్ని మార్చుకున్నా ఉపయోగం ఉండటం లేదు.ప్రజల ఆహారపు అలవాట్లు మారడంతో రెస్టారెంట్లలోనూ మెనూలో మార్పులు తీసుకొచ్చారు. నగరంలో 30కి పైగా చిన్నా, పెద్దా రెస్టారెంట్లు ఉన్నాయి. ఇందులో అధిక శాతం తందూరి రోటీ, చపాతి, పుల్కాలు, జొన్న రొట్టెలు ఆర్డర్ ఇస్తున్నారు. అందులో ఏదో ఒక కర్రీని ఆహారంగా తీసుకుంటున్నారు. చివరగా ఒక బిర్యానిని ముగ్గురు కలిసి ఆర్డర్ ఇచ్చి తింటున్నారు. గతంలో ఒక్కో బిర్యానిని ఒక్కొక్కరు తినేవారు. ఇప్పుడు బిర్యాని స్థానంలో రొట్టెలు వచ్చి చేరాయి. దీంతో పాటు రెస్టారెంట్లలో రాగి ముద్ద, రాగిసంకటి, కొర్ర అన్నం కూడా వండి పెడుతున్నారు. ఐదురోడ్ల కూడలిలో కేవలం సిరిధాన్యాలతో వండిన ఆహారపదార్థాలను విక్రయించడం విశేషం.జీవనశైలి వ్యాధులకు సిరిదాన్యాలే మందు అని ఇటీవల పలు సామాజిక మాధ్యమాల్లో సమాచారం చక్కర్లు కొడుతోంది. దీంతో ప్రజలు కొర్రలు, సామలు, అరికెలు, సజ్జలు కొనేందుకు ముందుకు వస్తున్నారు. 40ఏళ్లక్రితం ఇవి పేదల ఆహారంగా ఉండేవి. అప్పట్లో ధనవంతులు మాత్రమే వరి అన్నాన్ని భుజించేవారు. ఈ కారణంగా అప్పట్లో బీపీ, షుగర్ జబ్బులు అధిక శాతం ధనవంతులకు మాత్రమే వచ్చేవి. ఇప్పుడు వరి అన్నం అందరికీ అందుబాటులోకి రావడంతో 30 ఏళ్లుగా ఇదే ప్రధాన ఆహారంగా మారింది. అయితే వరిదాన్యాన్ని తెల్లగా పాలిష్ పట్టడంతో దానిపై ఉన్న పోషకాలు పోయి పిప్పిగా మారుతోంది. దీన్ని వండుకుని తినడంతో నేరుగా గ్లూకోజ్ మన శరీరంలోకి వెళ్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ కారణంగా ఇప్పుడు ఆహారంపై అవగాహన పెంచుకుని అలవాట్లను మార్చుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో జొన్నలు(రాయచూరు) రూ.55లు, కొర్రలు రూ.60లు, సామలు, అరికెలు రూ.80లకు పైగానే విక్రయిస్తున్నారు. ఇక సేంద్రీయ ఎరువులతో పండించిన సిరిదాన్యాలు కిలో రూ.110లకు పైగానే పలుకుతున్నాయి. గతంలో వీటిని కొనేవారు లేక పశువులకు పెట్టేవారంటే అతిశయోక్తి కాదు.

# సూర్యాపేటలో మేఘా గ్యాస్ సీఎన్జీ స్టేషన్

సూర్యాపేట, అక్టోబర్ 22 మేఘా ఇంజినీరింగ్ అండ్‌ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విభాగం మేఘా గ్యాస్ సూర్యాపేటలో తొలి సీఎన్జీ స్టేషన్ను శుక్రవారం నాడు ప్రారంభించింది. సూర్యాపేట మునిసిపల్ కమిషనర్ రామాంజనేయులు ఈ కాలుష్య రహిత సీఎన్జీ స్టేషన్ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ సేల్స్ ఆఫీసర్ మోహన్ కృష్ణ, మేఘా గ్యాస్ నల్లగొండ, ఇన్ ఛార్జి కే. తరుణ్ సాయి, ఖమ్మం జిల్లా ఇన్ ఛార్జి వంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరుణ్ సాయి మాట్లాడుతూ, "ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరికొన్ని సీఎన్జీ స్టేషన్లను ప్రారంభించనున్నాం. సూర్యాపేట సీఎన్జీ స్టేషన్కు వలిగొండలోని మదర్ స్టేషన్ను సీఎన్జీని సరఫరా జరుగుతుంది. గృహ అవసరాలో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ)ను సరఫరాను ఇప్పటికే వలిగొండలో ప్రారంభించాం. త్వరలో నల్లగొండ పట్టణం, బీబినగర్లలో కూడా పీఎన్జీ పంపిణీ చేయనున్నాం" అని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరో పన్నెండు సీఎన్జీ స్టేషన్లను మేఘా గ్యాస్ వచ్చే ఏడాది లోగా ప్రారంభించనున్నది. జాతీయ రహదారిలోని చౌటుప్పల్, చిట్యాల, కట్టంగూర్లో పాటు నల్లగొండ, భువనగిది, రాయగిరి, మిర్యాలగూడ, కొండమడుగు, మేల్వచెరువులలో ఈ సీఎన్జీ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నది.

# జెఎన్టీయూలో నకిలీ డాక్టరేట్లు




కాకినాడ, అక్టోబరు 22, (న్యూస్ పల్స్) ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో నకిలీ పీహెచ్‌డీలతో విద్యాబోధన యథేచ్ఛగా కొనసాగుతున్నా.. చర్యలు తీసుకోవాల్సిన వర్సిటీల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జేఎన్‌టీయూ (కాకినాడ) వర్సిటీ ఏపీలోని 8 జిల్లాల్లో విస్తరించి ఉంది. దీని పరిధిలో 180 అఫిలియేటెడ్ ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. ఒక్కో కళాశాలలో ఒకరిద్దరు చొప్పున ఎనిమిది జిల్లాల్లో సుమారు 200 మంది నకిలీ పీహెచ్‌డీ సర్టిఫికెట్లతో విద్యాబోధన చేస్తున్నట్లు తేటతెల్లమయ్యింది.యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నిబంధనల మేరకు అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ స్థాయిలో బోధించాలంటే పీహెచ్‌డీ తప్పనిసరి. గుర్తింపు పొందిన వర్సిటీల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థిని కళాశాలల్లో నియమిస్తే నెలకు రూ.90,000 నుంచి రూ.1,20,000 వరకు వేతనం ఇవ్వాలి. ఇంత మొత్తం ఇవ్వడం ఇష్టం లేని ప్రైవేట్ యాజమాన్యాలు తక్కువ జీతానికి వచ్చే ఫేక్ పీహెచ్‌డీ అభ్యర్థులకు రూ.40 వేల వరకు ఇస్తూ పబ్బంగడుపుకుంటున్నాయి.కొంతమంది అభ్యర్థులు కర్నాటక,తమిళనాడు,రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోని కొన్ని వర్సిటీలకు ఎంతో కొంత సమర్పించుకుని నకిలీ పీహెచ్‌డీ పట్టా తెచ్చుకుంటున్నారు. తక్కువ జీతానికే పనిచేస్తామని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను ఆశ్రయిస్తున్నారు. వారు సైతం ఖర్చు తక్కువ అవుతుందని భావించి.. అతి తక్కువ జీతాలిస్తూ వీరిని ప్రోత్సహిస్తున్నారు. కీలక ఉద్యోగాల్లో నియమిస్తున్నారు. అనుభవం లేని నకిలీ అధ్యాపకులు పాఠాలు బోధిస్తుండడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎడారిలో ఎండమావిలా మారింది.ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో యూనివర్సిటీ అధికారులు ప్రతి ఏటా నిజ నిర్ధారణ కమిటీల పేరు తో తనిఖీలు నిర్వహిస్తున్నా.. నకిలీ పీహెచ్‌డీలపై దృష్టి సారించడం లేదు. యాజమాన్యాలు ఇచ్చే ముడుపులు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.రాష్ట్రంలో నకిలీ పీహెచ్‌డీ సర్టిఫికెట్లతో వివిధ హోదాల్లో కొనసాగుతున్న వారి జాబితా చాంతా డంత ఉంది. ఏలూరు, తాడేపల్లిగూడెం, కాకినాడ, కృష్ణాజిల్లా చల్ల పల్లి, గుంటూరు, నర్సాపురంలోని కొన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇదే తంతు సాగుతోంది. దాదాపు 200 మంది వివిధ హోదాల్లో నకిలీ సర్టిఫికెట్లతో కొనసాగుతున్నారని తెలుస్తోంది.ప్రైవే టు ఇంజనీరింగ్ కళాశాలల్లో యూజీసీ, ఏఐసీటీఈ నిబంధనలు తప్పకుండా పాటించాలి. నకిలీ పీహెచ్‌డీ సర్టిఫికెట్లతో కళాశాలల్లో పనిచేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే నిజనిర్ధారణ కమిటీలు తనిఖీ సైతం నిర్వహించాయి. నకిలీ పీహెచ్‌డీ అభ్యర్థులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో కొన్ని యూనివర్సిటీలు పీహెచ్‌డీ పూర్తి చేసిన వారి డేటా వర్సిటీ వెబ్‌సైట్‌లలో ఉంచుతున్నారు. మిగతా యూనివర్సిటీలు కూడా పాటిస్తే పారదర్శకత పెరుగుతుంది.

# కర్ణాటక నీటి దోపిడి

బెంగళూర్, అక్టోబరు 22, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయం. దీని నుంచి జల చౌర్యానికి అలవాటు పడిన కర్ణాటక ఇబ్బడిముబ్బడిగా ఎత్తిపోతల పథకాలు, భారీ మోటార్లతో నీటి దోపిడీకి పాల్పడుతోంది. ఉమ్మడి రాష్ట్రాల ప్రాజెక్టుగా ఉన్నటువంటి తుంగభద్ర (టీబీ) డ్యాం నీటిని కేటాయించిన మేరకు అందించేందుకు బోర్డున్నా కూడా జల దోపిడీని అరికట్టలేకపోతోంది. ప్రాజెక్టు తమ భూభాగంలో ఉందనే ధీమాతో డ్యాం ఎగువన, దిగువన, నది పరీవాహక ప్రాంతాల్లో నుంచి ఇష్టానుసారంగా కర్ణాటక నీటిని దోపిడీ చేస్తోంది.ఈ దోపిడీపై గతేడాది అక్టోబర్ 22న టీబీ బోర్డు సమావేశంలో ఉమ్మడిగా తనిఖీలు చేయాలని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఇంజనీర్లు చేసిన సూచన మేరకు జాయింట్ కమిటీ ఏర్పాటుచేశారు. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 2 వరకు జాయింట్ కమిటీ తనిఖీలు నిర్వహించింది. ఈ కమిటీ విచారణలో కన్నడిగుల గుట్టురట్టు అయ్యింది. దీంతో కమిటీ ఇచ్చిన నివేదికను ఈ నెల 29న బెంగళూరులో జరుగనున్న టీబీ బోర్డు సమావేశంలో ప్రధాన అజెండాగా ప్రవేశ పెట్టనున్నారు. సమావేశంలో దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశముంది. తుంగభద్ర డ్యాం నీటిని దొంగచాటుగా కాజేసేందుకు టీబీ డ్యాం కుడి, ఎడమ వైపున మొత్తం 50 ఎత్తిపోతల పథకాలు ఉన్నట్లు జాయింట్ కమిటీ గుర్తించింది. ఇందులో కుడి వైపు 28, ఎడమ వైపు 22 ఉన్నాయి.

# జడ్పీ భేటీలో అందోళన

యాదాద్రి యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం రసాబసగా జరిగింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన జడ్పీటీసీ నగేష్ మాట్లాడుతుండగా మైక్ కట్ చేయించడంతో అయన ఆగ్రహం వ్యక్తం చేసారు. మైకును నేలకు కొట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు పోడియం ముందు కూర్చుని నిరసన వ్యక్తం చేసారు. గ్రామాల్లో జరిగే ప్రారంభోత్సవాలకు కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించడం లేదంటూ వారు నిరసన వ్యక్తి చేసారు.నిధుల మంజూరు లో కూడా అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు గెలిసిన మండలాల్లో నిధులు కేటాయించడం లేదంటూ అందోళనకు దిగారు.

# తప్పుడు కేసులు పెడుతున్నారు

అమరావతి జగన్ రెడ్డి గ్యాంగ్ డ్రగ్ మాఫియాలో ఆరితేరారన్న గుట్టు రట్టయింది. జగన్ రెడ్డికి సీబీఐ కేసులు, డ్రగ్ కేసులతో ఫ్రస్టేషన్ వచ్చింది. టీడీపీ మరల అధికారంలోకి వస్తుందని ఆయన స్వంత సర్వేలో తేలడంతో ఫ్రస్టేషన్ లో వున్నారని టీడీపీ నేత జి.వి.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం అయన మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి పట్ల ఆయన పార్టీలోనే వ్యతిరేకత పెరిగిపోయింది. పట్టాభి బోసడీకె అనడం తప్పే. పట్టాభి మాట్లాడితే టీడీపీ కార్యాలయాలు పగలకొడతారా. ఉద్యోగులను తలలు పగలకొడతారా. తప్పుడు కేసులు పెట్టి దుర్మార్గంగా అరెస్టు చేస్తున్నారు. గంజాయి లిక్విడ్ లీటర్ బాటిల్ 5 లక్షలకు జగన్ సపోర్టుతో అమ్ముడవుతోంది. హెరాయిన్ కేసులకు మూలం ఏపీ అవుతోంది ఈరోజు. వైఎస్ఆర్ లాగా మంచి చేస్తారని గెలిపిస్తే నట్టేట ముంచుతారా. ఏపీలో దొరుకుతున్న హెరాయిన్ 2% మాత్రమే. 98 % మీరు బియ్యంలో పెట్టి కూడా సరఫరా చేస్తున్నారు. ఏపీలో ప్రతీ గ్రామంలో నాటుసారా ఏరులై పారుతోంది. రమ్మనండి మీ ఎక్సైజు మంత్రికి చూపిస్తాం. మీరు క్రిమినల్ సైకో గా మారిపోయారు కనుకనే మీ ఇగో దెబ్బతింటోంది. మాకు క్రమశిక్షణ ఉంది... మేము పసుపు సైనికులం. యువతకు ఉద్యోగలిస్తామని డ్రగ్స్ కు అలవాటు చేస్తారా. జగన్ రెడ్డి తల్లిని పట్టాభి తిట్టలేదు. అనని మాటలు అన్నట్టు చూపించి సానుభూతి పొందాలని చూస్తున్నారు. మీ ఎంఎల్ఏ లు మాట్లాడిన మాటలకు, దాడులకు సీఎం సమాధానం చెప్పాలి. డీజీపీ రాష్ట్ర పరువు ప్రతిష్టలు మంటగలిపాడు. ఆరుసార్లు కరెంటు ఛార్జీలు పెంచి 12వేల కోట్లు ప్రజలపై భారం వేసారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంటు ఇస్తామని మోసం చేసారు. పెన్షన్ విషయంలోనూ మోసమే. చంద్రబాబు ను తిట్టినా మీలాగా తప్పుడు కేసులు పెట్టలేదు. వైసీపీ నేతలు ఏం చేస్తారు.. రౌడీయిజం, గుండాయిజం ప్రేరేపిస్తారా. నేరుగా డ్రగ్స్, దంధాలను ప్రోత్సహించే సీఎం ను ఎక్కడా చూడలేదు. అధికారం శాశ్వతం కాదు సీఎం జగన్. డ్రగ్స్ అమ్ముతున్న జగన్ ముఠాను ప్రజల ముందుంచుతామని అన్నారు.

# పోలీస్ అమరవీరుల సేవలు వెలకట్టలేనివి







## భారీ ర్యాలీ ను నిర్వహించిన పోలీస్ అధికారులు

## ర్యాలీలో పాల్గొన్న విద్యార్థిని,విద్యార్థులు

తుగ్గలి అక్టోబరు 22,( విభారె) పోలీస్ అమరవీరుల సేవలు వెలకట్టలేనివని పాఠశాలల ఉపాధ్యాయులు తెలియజేశారు.పోలీస్ అమరవీరుల సంస్కరణ సభలో భాగంగా శుక్రవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలో పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదోని-గుత్తి ప్రధాన రహదారిపై తుగ్గలి పోలీస్ స్టేషన్ నుండి తుగ్గలి ఎంపీడీవో కార్యాలయం వరకు పోలీసుల ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్యం మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ ను నిర్వహించారు.పోలీస్ అమరవీరుల సేవలు మరువలేనివని పెద్ద పెద్ద నినాదాలతో విద్యార్థులు ర్యాలీ ను విజయవంతం చేశారు.అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ నేటి సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులది కీలకమైన పాత్రని వారు తెలియజేశారు.పోలీసు వ్యవస్థ ద్వారా దేశవ్యాప్తంగా శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని వారు తెలియజేశారు.ఎంతో మంది గొప్ప గొప్ప పోలీసుల అమరవీరుల వీర మరణాలతోనే నేటి సమాజం సస్యశ్యామలంగా ఉందని వారు తెలియజేశారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులను ప్రజలు మననం చేసుకోవడం ఒక బాధ్యతగా ప్రతి పౌరుడు స్వీకరించాలని వారు తెలియజేశారు.ప్రపంచం అతలాకుతలమైన కరోనా గడ్డు పరిస్థితులలో కూడా విధి నిర్వహణలో పోలీసులు వెనకడుగు వేయకుండా ప్రజలకోసం రేయింబవళ్లు సేవలు నిర్వహించారని వారు తెలియజేశారు .ఏఎస్ విద్యాసంస్థల విద్యార్థులు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ పోలీస్ అమర వీరులకు సమర్పణ అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ రూరల్ సి.ఐ రామకృష్ణా రెడ్డి,తుగ్గలి ఎస్.ఐ షామీర్ భాష,జొన్నగిరి ఎస్సై రామాంజనేయులు, నరసప్ప,తుగ్గలి మరియు జొన్నగిరి పోలీస్ సిబ్బంది,ఏఎస్ విద్యాసంస్థల చైర్మన్ గుర్రాల వెంకటరెడ్డి,హై స్కూల్ మరియు ఏ.ఎస్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలి

## ఏబీవీపీ కర్నూల్ జిల్లా కన్వీనర్ మారుతి

ఎమ్మిగనూరు అక్టోబరు 22,( విభారె) ముగతి గ్రామంలో ఉన్నటువంటి ఏ.పీ మోడల్ స్కూల్ లో మధ్యాహ్న భోజన మెనూను విద్యార్థులకు నాణ్యత లేని భోజనం అందిస్తున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మారుతి అన్నారు.మధ్యాహ్నం భోజనం పరిశీలించడానికి వెళ్లి అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేయగా అక్కడ విద్యార్థులకు పెట్టే అన్నం సరిగా ఉడక లేదని సాంబారు కూడా నీళ్లు ఉండడం



దీనినే విద్యార్థులకు పెడుతున్నారన్నారు. ఈరోజు శుక్రవారం మెనూ ప్రకారం గుడ్డు పెట్టాల్సి ఉండగా పెట్టలేదన్నారు. అలాగే దసరా సెలవుల తర్వాత పాఠశాలలు ప్రారంభమైన అప్పటినుండి ఇప్పటివరకు విద్యార్థులకు సరిగా గుడ్డు మరియు చిక్కి లాంటివి అందించ లేదన్నారు. భోజనంలో నాణ్యత లేకపోవడం వలన విద్యార్థులు సరిగా తినలేదని మిగిలిన అన్నాన్ని వంట సిబ్బంది పందులకు సరఫరా చేస్తున్నారని అన్నారు. దీనిని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ఏపీ మోడల్ స్కూల్ ముగతి ప్రిన్సిపల్ వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు లక్ష్మణ్ మరియు పవన్ పాల్గొన్నారు

# నెల్లూరు రెడ్ క్రాస్ స్పాస్టిక్ సెంటర్ ఆధునిక వసతుల కల్పన

నెల్లూరు అక్టోబరు 22,( విభారె) నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్లో విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థిని విద్యార్థులకు ఆధునిక వసతులు కల్పించినట్లు నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి.చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రతిరోజూ పిల్లలందరకీ మధ్యాహ్నం ఉచిత పౌష్టికారంతో పాటు, ఉదయం ఉ సాయంత్రం స్నాక్స్, సాయంత్రం పాలు అందించే కార్యక్రమం, అలానే పిల్లలనీధరకీ ఉచిత ట్రాన్స్పోర్టేషన్ ఏర్పాటు చేయడం, ప్రతి నెల మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి పిల్లలకు ఉచితంగా మందులు ఇచ్చే కార్యక్రమాలు ప్రారంభనీ. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇకపై రెడ్ క్రాస్ ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్ విద్యార్థులందరికి ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని తెలియదు చేశారు . ప్రతిరోజూ ఉదయం పూట స్నాక్స్, మధ్యాహ్నం పౌష్టికాహారం, సాయంత్రం పాలు, పండ్లు ఉచితంగా పిల్లలకు ఇచ్చే కార్యక్రమశ్రీ ప్రారంభించడనీ ద్వారా . శారీరకంగా, మానసికంగా కొంత బలహీనంగా ఉండే విధ్యార్థులకు రోజుకు 3 సార్లు ఇలా ఇచ్చే ఆహారంతో విధ్యార్థులు ఆరోగ్యంగా ఎదుగుతారని తెలియచేసారు. అలానే వారిలో ఉత్సాహం నింపేందుకు డాన్స్, మ్యూజిక్ లాంటి కళలను నేర్పించేందుకు టీచర్లను ఏర్పాటు చేయడం జరిగింది అని తెలియ చేశారు . ఇకపై ప్రతి నెల 2వ శనివారం మెడికల్ క్యాంపు నిర్వహించి, ఉచితంగా పిల్లలకు మందుల పంపిణి చేయటం జరుగుతుందని తెలియచేసారు.ఈ సంధర్భంగా ఎం ఎస్ ఆర్ స్పాస్టిక్స్ సెంటర్ కన్వీనర్ నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్ నందు మెడికల్ క్యాంప్ ను ప్రముఖ సైకియాట్రిస్ట్ డా. పి.వి.రెడ్డి చే ఏర్పాటు చేయడం తో , ఈ మెడికల్ క్యాంప్ నందు 50 మంది విధ్యార్థులను పరీక్షించి తగు సూచలను ఇచ్చి, ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగిందని తెలియచేసారు. అలానే ఈ రోజు నుంచి ప్రతి రోజు విధ్యార్థులకు ఉచితంగా నాణ్యమైన పౌష్టికారంతో పాటు గుడ్డు, పాలు, స్నాక్స్ పంపిణీ చేయడం చాలా సంతోషం గా ఉంది అని తెలియచేసారు.

అలానే ఛైర్మన్ సూచలనతో స్పాస్టిక్స్ సెంటర్ స్కూల్ నందు టైమింగ్ నందు మార్పులు చేశామని తెలియచేసారు. తదుపరి విధ్యార్థుల తల్లితండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశమునకు 45 మంది పేరంట్స్ హాజరు అయ్యి వారి సూచలను, సలహాలను తెలియచేసి రెడ్ క్రాస్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా శాఖ మేనజింగ్ కమిటీ సభ్యులు గునపాటి ప్రసాద్ రెడ్డి, యడవలి సురేష్, నెల్లూరు జిల్లా శాఖ కింద వున్న ఎం ఎస్ ఆర్ స్పాస్టిక్స్ సెంటర్ ప్రాజెక్టు కన్వీనరు నేతాజీ సుబ్బారెడ్డి, కొ కన్వీనరు డి. జ్యోత్స్న,ప్రిన్సిపల్ గురునాథం, వైస్ ప్రిన్సిపల్ మాధురి, రెడ్ క్రాస్ ఏఆర్వి కన్వీనర్ వెంకు రెడ్డి, రెడ్ క్రాస్ మెడికల్ షాప్ కన్వీనర్ మురళి క్రిష్ణ, రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యులు మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

### . ఎస్ ఎఫ్ ఐ

బేతంచర్ల అక్టోబరు 22,( విభారె) పట్టణంలో ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ తూర్పు ప్రాంతం జిల్లా ఉపాధ్యక్షుడు యం.మధు శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు స్థానిక పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులతో వారు మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేతంచర్ల పట్టణంలో ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసేంత వరకు మనమంతా కలిసి పోరాడాలన్నారు. పట్టణంలో ఉన్న ఒక్క ఎయిడెడ్ కళాశాలను ప్రైవేట్ పరం చేయడం వల్ల విద్యార్థులకు మరింత ఫీజుల భారం పడింది అన్నారు. పట్టణంలో ఇంటర్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసిన తర్వాతనే పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలను ప్రవేట్ పరం చేయాలన్నారు. అంతవరకూ పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలను ఎయిడెడ్ గానే కొనసాగించాలని వారు కోరారు. తక్షణమే ప్రభుత్వము, ఎమ్మార్వో గారు స్పందించి పట్టణంలో ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు పునస్కరించుకొని బార్మీ

కడప అక్టోబర్ 22 :ఈరోజు ఉదయం కడప నగరంలోని శారద నిలయం స్కూలు వద్ద ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు అల్లాబకాస్ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని బార్మీ ని ప్రారంభించిన కడప అసెంబ్లీ టీడీపీ ఇంచార్జ్ వి.ఎస్.అమీర్ బాబు మరియు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహమ్మద్ ప్రవక్త జన్మదినం నుంచి ఈ నెలంతా ముస్లింలు బార్మీ నిర్వహించడం ఆనవాయితీ..ఇతరుల ఆకలి తీర్చడంలో మానవసేవే మాధవసేవ అనే సిద్ధాంతానికి కట్టుబడి ఉండటం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోలుదాసు కృష్ణమూర్తి, కడప నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సానపురెడ్డి శివకొండారెడ్డి, జలతోటి జయకుమార్, కడప పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నక్కల శివరాం, కడప పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి అన్వర్ హుస్సేన్, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి అమూరి బాలదాసు, కడప పార్లమెంట్ కార్యదర్శి మాసా కోదండ రామ్, కడప పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ అబిద్ పాషా, మైనారిటీ నాయకుడు సి.ఎస్.నాసర్ అలీ, కొమ్మలపాటి, కొండా సుబ్బయ్య, విశ్వనాథ్ మరియు ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యగారి ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిన బ్లాక్ బస్టర్ సక్సెస్..!



యూత్ కింగ్ అఖిల్ అక్కినేని "మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్లర్" సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. 'అఖిల్' సినిమాతో పూర్తి స్థాయి హీరోగా మారిన అఖిల్ కు ఇది ఫస్ట్ కమర్షియల్ హిట్. నిజానికి తొలి సినిమా నుంచి సరైన సక్సెస్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్న యువ హీరోకి.. పాజిటివ్ టాక్ తెచ్చుకున్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద వసూళ్ళు రాబట్టలేకపోవడం బ్యాడ్ లక్ అనే అనుకోవాలి. ఏదైతేనేం అక్కినేని వారసుడు కాస్త లేట్ అయినా సాలిడ్ హిట్ అందుకున్నాడు. ఐదు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ టార్గెట్ ని అందుకొని లాభాల బాట పట్టాడు.బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్ గా నటించింది. మెగా నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 బ్యానర్ లో బన్నీ వాసు - వాసు వర్మ ఈ చిత్రాన్ని నిర్మించారు. కరోనా నేపథ్యంలో వాయిదా పడుతూ వచ్చిన ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుని మంచి వసూళ్ళు రాబట్టింది. ఈ నేపథ్యంలో కోవిడ్ సెకండ్ వేవ్ తర్వాత బిగ్గెస్ట్ హిట్స్ లో ఒకటిగా అఖిల్ సినిమా నిలిచింది.బ్లాక్ బస్టర్ హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్ - డైరెక్టర్ భాస్కర్ సక్సెస్ అవడంలో.. అల్లు అరవింద్ - గీతా ఆర్ట్స్ కీలక పాత్ర పోషించారు. అలానే గ్లామరస్ హీరోయిన్ పూజా హెగ్డే - మ్యూజిక్ డైరెక్టర్ గోపీ సుందర్ అందించిన సంగీతం కూడా ప్లస్ అయ్యాయి. స్క్రీన్ ప్రెజెన్స్ లో ఫస్ట్ సినిమాతోనే తానేంటో చూపించిన అఖిల్.. ఈ సినిమాలో నటన - హావభావాలు చూపించడంలో మరో మెట్టు ఎక్కారనే చెప్పాలి. ఇక అఖిల్ - పూజాహెగ్డే ల మధ్య కెమిస్ట్రీ చాలా బాగా కుదిరింది. వీరి మధ్య రొమాన్స్ సినిమాలోనే హైలైట్స్ లో ఒకటిగా పేర్కొనవచ్చు.'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' చిత్రంలో ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటుగా చూపించిన కామెడీ - లవ్ స్టోరీ - సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అందుకే దసరా సెలవుల్లో ఫ్యామిలీ అంతా కలసి థియేటర్లకు క్యూ కట్టారు. ఏపీలో వంద శాతం ఆక్యుపెన్సీకి అవకాశం ఇవ్వడం కూడా సినిమా మంచి కలెక్షన్స్ అందుకోవడానికి కారణమైంది. ఇక యుఎస్ లో అఖిల్ మూవీ హాఫ్ మిలియన్ డాలర్లకు పైగా రాబట్టి అక్కడ కూడా సత్తా చాటింది.బ్యాచిలర్ సినిమా విజయం అఖిల్ తో పాటుగా అక్కినేని అభిమానులకు ఊరటనిచ్చిందనే చెప్పాలి. ఈ మూవీ సక్సెస్ ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు అందుకుంటారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న "ఏజెంట్" సినిమాతో అఖిల్ అంటే ఏంటో చూపిస్తారని ధీమాగా ఉన్నారు. స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అఖిల్ ఓ స్పై గా కనిపించనున్నారు. ఇన్నాళ్లూ లవర్ బాయ్ పాత్రలు చేసిన అక్కినేని వారసుడు.. ఈ సినిమా కోసం సరికొత్త లుక్ లో కనిపించనున్నాడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాల్లో అఖిల్ ట్రాన్స్ఫర్మేషన్ చూసి అందరూ షాక్ అయ్యారు.'ఏజెంట్' చిత్రానికి వక్కంతం వంశీ కథను అందిస్తున్నారు. ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేందర్ రెడ్డి కి చెందిన సురెండర్2 సినిమాస్ సంస్థ నిర్మాణ భాగస్వామి గా ఉంది. స్పై థ్రిల్లర్ జానర్ లో రూపొందుతున్న ఈ చిత్రంలో అఖిల్ సరసన సాక్షి వైద్య హీరోయిన్ గా నటిస్తోంది. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు.

# 'రాధే శ్యామ్' నుంచి డార్లింగ్ సర్ప్రైజింగ్ పోస్టర్..!



మరో రెండు రోజుల్లో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పుట్టినరోజు ఉండటంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ సందడి మొదలు పెట్టేసారు. ఇప్పటికే డార్లింగ్ అభిమానులు ట్విట్టర్ లో 'ప్రభాస్ బర్త్ డే మంత్' అనే హ్యాష్ ట్యాగ్ ను ట్రెండ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో బర్త్ డే కానుకగా ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాల నుంచి ఫ్యాన్స్ కు సర్ప్రైజ్ ఇవ్వడానికి మేకర్స్ రెడీ అయ్యారు.రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న 'రాధే శ్యామ్' సినిమా నుంచి టీజర్ ని రిలీజ్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అక్టోబర్ 23 ఉదయం విక్రమాదిత్య ఎవరనే విషయాన్ని తెలియజేస్తామని తెలిపారు. అయితే అంతకంటే ముందుగా చిత్ర బృందం అభిమానుల కోసం ఓ సర్ప్రైజ్ ఇచ్చింది. ప్రభాస్ కు సంబంధించిన ఓ ఎక్స్ క్లూజివ్ పోస్టర్ ని దర్శకుడు తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేశారు.ప్రభాస్ ఇందులో ట్రెండీ కాస్ట్యూమ్స్ - బ్లాక్ గ్లాసెస్ ధరించి సూపర్ కూల్ అండ్ అల్ట్రా స్టైలిష్ గా కనిపిస్తున్నారు. ఇటీవల డార్లింగ్ లుక్ ని ట్రోల్ చేసిన వారందరి నోళ్లు మూయించేలా ఈ పోస్టర్ ఉంది. గ్లోబల్ ప్రభాస్ డే ని మరింత స్పెషల్ గా మార్చేలా చేసిన ఈ పిక్ తో ఫ్యాన్స్ ఆనందంలో ఎగిరి గంతేస్తున్నారు. 'డార్లింగ్ విక్రమాదిత్య' అంటూ 'రాధే శ్యామ్' దర్శకుడు పోస్ట్ చేసిన ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.కాగా యావత్ సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా చిత్రాల్లో "రాధే శ్యామ్" ఒకటి. ఇది ప్రభాస్ కెరీర్ లో వస్తున్న 20వ చిత్రం. 70ల కాలం నాటి ఇటలీ నేపథ్యంగా సాగే ప్రేమ కథతో పీరియాడికల్ మూవీగా రూపొందుతోంది. ఇందులో ప్రభాస్ సరసన పూజాహెగ్డే హీరోయిన్ గా నటిస్తోంది. కృష్ణంరాజు - భాగ్యశ్రీ - జగపతిబాబు - ప్రియదర్శి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 2022 సంక్రాంతి కానుకగా జనవరి 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.'రాధే శ్యామ్' చిత్రాన్ని కృష్ణంరాజు సమర్పణలో యూవీ క్రియేషన్స్ - టీ సిరీస్ - గీతాకృష్ణ సంస్థలు కలసి భారీ బడ్జెట్ తో రూపొందిస్తున్నాయి. వంశీ - ప్రమోద్ - భూషణ్ కుమార్ - ప్రశీద దీనికి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ - మిథున్-మనన్ భరద్వాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాకి కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు.

# అదంతా గతం.. ఈసారి చరిత్రను తిరగరాస్తాం: బాబర్ అజమ్




టీమిండియా- పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌కు ఇంకా రెండు రోజులే మిగిలి ఉండడంతో ఎవరు గెలుస్తారనే దానిపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇరు జట్ల మధ్య మ్యాచ్ అంటే హై వోల్టేజ్‌తో కూడుకొని ఉండడంతో భావోద్వేగాలు సహజంగానే బయటపడతాయి. మేం గెలుస్తామంటే మేం గెలుస్తామంటూ టీమిండియా- పాక్ అభిమానులు పోటీ పడి మరీ చెబుతున్నారు. ఇంత వేడి వాతావరణంలో జరగనున్న మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారనేది హాట్‌టాఫిక్‌గా మారింది.ఈ నేపథ్యంలోనే పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ అజమ్ ఈసారి కచ్చితంగా టీమిండియాపై విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. " ఇండియాతో మ్యాచ్‌ను మేం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. రెండు జట్ల మధ్య అంటేనే పోటీ ఆసక్తికరంగా ఉంటుంది. ఇప్పటివరకు టి20 ప్రపంచకప్‌లో టీమిండియాను ఓడించలేదనేది వాస్తవం. కానీ అదంతా ఒక గతం.. మేం చరిత్రను తిరగరాయబోతున్నాం. అక్టోబర్ 24న జరగనున్న మ్యాచ్‌లో కచ్చితంగా విజయం మాదే అవుతుంది. అందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ప్రణాళికలు రచించుకున్నాం. ఒత్తిడిలో ఎలా ఆడాలన్నది మాకు బాగా అలవాటు అయింది. మ్యాచ్ మాత్రం కౌంటర్‌కు ఎన్‌కౌంటర్‌లా కొనసాగుతుంది. హై వోల్టేజ్‌తో సాగే మ్యాచ్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు నియంత్రణ కోల్పోకూడదని ఆశిస్తున్నా. మ్యాచ్ జరగనున్న దుబాయ్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది. అయితే మా దగ్గర ఉన్న అస్త్ర శస్త్రాలతో టీమిండియాతో మ్యాచ్‌కు బరిలోకి దిగుతున్నాం. ఈసారి కచ్చితంగా విజయం మాదే అవుతుంది." అంటూ చెప్పుకొచ్చాడు.ఇక పాకిస్తాన్ ఇంతవరకు టి20 ప్రపంచకప్‌లో ఒక్కసారి కూడా టీమిండియాను ఓడించలేకపోయింది. పొట్టి ఫార్మాట్ ప్రపంచకప్‌లో ఐదు సార్లు తలపడగా.. ఐదుసార్లు టీమిండియానే గెలిచింది. ఇక వన్డే ప్రపంచకప్‌లోనూ ఈ రికార్డు పదిలంగా ఉంది. వన్డే ప్రపంచకప్‌లలో? టీమిండియా పాకిస్తాన్‌తో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడం విశేషం.అయితే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో మాత్రం ఇరు జట్లు ఐదుసార్లు తలపడగా.. రెండు సార్లు టీమిండియా.. మూడుసార్లు పాకిస్తాన్ విజయం సాధించింది. అయితే బాబర్ అజమ్ కామెంట్స్‌పై టీమిండియా ఫ్యాన్స్ వినూత్నంగా ట్రోల్ చేశారు. " మ్యాచ్‌కు ముందు ప్రతీ పాకిస్తాన్ కెప్టెన్ చెప్పే మాట ఇదే.. ఈసారి కూడా గెలుపు టీమిండియాదే.. మ్యాచ్ గెలిచి ఈ మాట చెప్పు బాబర్.. ఈసారి కూడా చరిత్ర రిపీట్ అవుతుంది.. నీ అంచనా తప్పవుతుంది." అంటూ కామెంట్స్ చేశారు.

## టీమిండియా- పాకిస్తాన్ ఫైనల్లో తలపడితే చూడాలనుంది

టి20 ప్రపంచకప్ 2021 ఫైనల్లో టీమిండియా- పాకిస్తాన్ తలపడితే బాగుంటుందని టీమిండియా మాజీ దిగ్గజం సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు. ఇది నా ఒక్కడి కోరిక కాదని.. ఐసీసీ కౌన్సిల్ నుంచి ఫ్యాన్స్ వరకు ఇదే కోరుకుంటున్నారని పేర్కొన్నాడు. ఇప్పటివరకు టి20 ప్రపంచకప్‌లలో 5 -0తో టీమిండియా పాకిస్తాన్‌పై స్పష్టమైన ఆధిక్యం కనబరిచిందని.. అలాగే వన్డే వరల్డ్‌కప్‌లో 7-0తో మంచి రికార్డు కలిగి ఉందని తెలిపాడు. లీగ్ మ్యాచ్‌లో టీమిండియా పాకిస్తాన్‌పై విజయం సాధించాలని ఆశాభావం వక్తం చేశాడు.ఇక టి20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరే నాలుగు జట్ల పేర్లను సునీల్ గావస్కర్ ప్రకటించాడు. పాకిస్తాన్ లెజెండ్ వసీమ్ అక్రమ్‌తో కలిసి సలామ్ క్రికెట్ 2021 కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న సునీల్ గావస్కర్ తన ఫేవరెట్ జట్లను తెలిపాడు. సెమీస్ చేరే వాటిలో టీమిండియా, పాకిస్తాన్, ఇంగ్లండ్, వెస్టిండీస్ ఉండాలని పేర్కొన్నాడు.

# చైతూ లైనప్ పెరుగుతూనే ఉంది

నాగ చైతన్య వరుస సినిమాలతో జోరు మీదున్నాడు. ఇటీవలే లవ్ స్టోరీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నాగచైతన్య ఈ ఏడాది చివర్లో బాలీవుడ్ మూవీ లాల్ సింగ్ చద్దా తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అమీర్ ఖాన్ హీరోగా నటించిన ఈ సినిమాతో నాగ చైతన్య కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. మొదటి సారి చైతూ బాలీవుడ్ లో నటించిన ఈ సినిమా పై తెలుగు ప్రేక్షకులు కూడా చాలా అంచనాలు పెంచుకుని ఉన్నారు. ఖచ్చితంగా ఈ సినిమా



బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోబోతుంది. బాలీవుడ్ సినిమాల జోరు మళ్లీ మొదలు అవుతున్న నేపథ్యంలో లాల్ సింగ్ చద్దా భారీ ఎత్తున వసూళ్లను దక్కించుకుంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. ఇక వచ్చే ఏడాది సమ్మర్ కు విక్రమ్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'థ్యాంక్యూ' సినిమా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి.థ్యాంక్యూ సినిమా చిత్రీకరణ ఇప్పటికే ముగింపు దశకు వచ్చినట్లుగా తెలుస్తోంది. థ్యాంక్యూ సినిమా చాలా విభిన్నమైన కాన్సెప్ట్ తో రూపొందినట్లుగా యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఇప్పటికే నాగార్జున బంగార్రాజు సినిమాను కూడా చైతూ చేసేందుకు సిద్దం అయ్యాడు. తండ్రి తో కలిసి ఇప్పటికే మనం సినిమాలో నటించిన చైతూ ఈసారి బంగార్రాజు సినిమాలో చాలా విభిన్నమైన పాత్రలో నటించేందుకు సిద్దం అయ్యాడు. చైతూ బంగార్రాజు సినిమాను ఈ ఏడాది చివరి వరకు ముగించే అవకాశాలు ఉన్నాయి. బంగార్రాజు సినిమా లో చైతూ మరియు నాగార్జునల మధ్య ఉండే సన్నివేశాలు ఖచ్చితంగా ఆకట్టుకునే విధంగా ఉంటాయనే నమ్మకంతో అక్కినేని అభిమానులు ఆ సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు.ఇక అధికారికంగా ప్రకటన రాని సినిమాల విషయానికి వస్తే.. ఇప్పటికే మోహన కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో ఒక సినిమాను చైతూ చేసేందుకు కమిట్ అయ్యాడు. త్వరలోనే ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. అంతే కాకుండా వచ్చే ఏడాది ఆరంభంలో చిత్రీకరణ మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మోహన కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో సినిమా మాత్రమే కాకుండా నందిని రెడ్డి దర్శకత్వంలో కూడా చైతూ ఒక సినిమాను చేయబోతున్నాడు. వైజయంతి మూవీస్ బ్యానర్ లో నందిని రెడ్డి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఒక సినిమా పట్టాలెక్కాల్సి ఉండగా.. కొన్ని కారణాల వల్ల విజయ్ దేవరకొండ ను తప్పించి చైతూను ఆ సినిమాలో నటింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. మొత్తానికి చైతూ సినిమాల లైనప్ చూస్తుంటే ఆయన వచ్చే ఏడాది అంతా కూడా కంటిన్యూస్ గా కొత్త సినిమాలతో బిజీ బిజీగా ఉండబోతున్నట్లుగా తెలుస్తోంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190